క్లుప్తంగా

ఘనంగా దీపావళి వేడుకలు



బాణసంచా కాలుస్తున్న శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లని పారద్రోలినట్లు... ఒక్కొక్క మార్పు సాధించుకుంటూ గొప్ప జీవితాన్ని నిర్మించుకుందాం అని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని సోమవారం ఆమె నివాసంలో బాణసంచా కాల్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు తప్పుడు కేసులకు, బెదిరింపులకు భయపడేవాళ్లు కాదన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: మండల పరిధిలో దీపావళి పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వ్యాపార సంస్థలు, ఇంటి పరిసరాలను దీపాలతో అలంకరించి లక్ష్మి పూజలు చేశారు. అనంతరం చిన్నాపెద్దా అంతా పటాకులు కాల్చి సంతోషంగా గడిపారు.

పార్టీ పదవులకు రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పార్టీ పదవులకు రాజీనామా చేశారు. పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదని, అందువల్ల పదవులకు రాజీనామా చేస్తున్నామని బీఆర్‌ఎస్ నాయకులు ఎక్బాల్ బిన్ ఖలీఫా, నాయకుడు సయ్యద్ యూసుఫ్ పటేల్, షర్ఫుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.బేగ్ షాకీర్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు అంజద్ ఖాన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సయ్యద్ ఫెరోజ్ తెలిపారు. రాజీనామాలను ఆమోదించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. సబితారెడ్డి విజయానికి ఎంతో కృషి చేశామన్నారు.

ఆర్‌ఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎన్నికల అబ్జర్వర్



డీసీపీ, ఏసీపీలతో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ రామ్‌కుమార్ సధురప్పన్

చైతన్యపురి: తెలంగాణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రామ్‌కుమార్ సధురప్పన్ సోమవారం ఎల్‌బీనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ పరిశీలన వివరాలు, నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి ఎస్. పంకజను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ జానకిరెడ్డితో కలిసి నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ఒకటైన శివగంగా కాలనీ ఎంఎస్‌పీఎన్ పాఠశాలను, చైతన్యపురి ఖజాన జ్యువెలర్స్ సమీపంలో పోలీస్‌లు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్, కొత్తపేటలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారాన్ని పరిశీలించారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న చిత్తారి

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడిగా కవాడిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఇరుగు చిత్తారి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బర్రె రాజ్‌కుమార్ జారీచేసిన నియామక ఉత్తర్వులను ఆయన చేతుల మీదుగా సోమవారం చిత్తారికి అందజేశారు. చిత్తారి మాట్లాడుతూ.. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని పార్టీ కోసం పనిచేస్తున్న తనను పార్టీ గుర్తించి మండల ఎస్సీసెల్ అధ్యక్షుడిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఎస్సీలందరినీ ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గెలుపే లక్ష్యం

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా సోమవారం మండల పరిధిలోని పల్లెచెలకలో స్థానిక నాయకులతో కలిసి వారు ప్రచారం నిర్వహించారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- ప్రతిపక్ష నేతల మాటలు నమ్మకండి
- నా బలం, బలగం నియోజకవర్గ ప్రజలే
- భారీ మెజార్టీతో గెలిపించండి
- మంత్రి సబితారెడ్డి విజ్ఞప్తి



వెంకటగిరి కాలనీలో ప్రచారంలో పాల్గొన్న సబితారెడ్డి

మీర్‌పేట: అధిక నిధులు మంజూరు చేసి కాలనీలను అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించి అభివృద్ధికి పట్టం కట్టాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అభ్యర్థించారు. ప్రతిపక్షపార్టీ నేతల మాటలను నమ్మొద్దని సూచించారు. తన బలగం, బలం నియోజకవర్గ ప్రజలేనని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ 4, 17 డివిజన్ల పరిధిలోని హనుమాన్‌నగర్, వెంకటగిరికాలనీల్లో సబితారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని జంట కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో రూ.832కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు చెరువులను రక్షించి.. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు సుందరీకరించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ప్రచారంలో కాలనీవాసులు మంత్రికి స్వాగతం పలికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఇంటింటి ప్రచారం

కందుకూరు: మంత్రి సబితారెడ్డికి మద్దతుగా సోమవారం మండల పరిధిలోని కొత్తూర్, గఫూర్‌నగర్, కొత్తగూడ గ్రామాల్లో మాజీ ఎంపీపీ శోభ మహిళా కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేసి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సబితారెడ్డికి అండగా..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లోని గద్దం ఎన్‌క్లేవ్ ఫేస్–1,2,3, అరవింద్‌నగర్, మారుతినగర్ కాలనీల్లో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి, మంత్రి సబితారెడ్డిని మరోమారు గెలిపించాలని అభ్యర్థించారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు స బితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు.

విశ్వనగరంగా హైదరాబాద్

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో గ్రేటర్ హైదరాబాద్ విశ్వనగరంగా మారుతోందని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్‌కేపురం హరిపురికాలనీ, రోడ్ నంబర్–1లో గ్రీస్ టవర్స్ అపార్ట్‌మెంట్స్ వాసులతో ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎల్‌బీనగర్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. పెరగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని రహదారులను విస్తరించామని పేర్కొన్నారు. అదేవిధంగా మెట్రో విస్తరణతో పాటు శివారు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయని గుర్తుచేశారు. ఓ విజన్‌తో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు. బస్తీ దవాఖానాలతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేటీఆర్ ప్రతి డివిజన్‌కు ఒక వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని, సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. అభివృద్ధిని చూసి మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, అరవింద్‌శర్మ, పెండ్యాల నగేశ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డి సమక్షంలో..

బడంగ్‌పేట్: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం బడంగ్‌పేటకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్‌ను అన్ని విధాల అభివృద్ధి చేశానని, మరోమారు కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీతో మహేశ్వరం నియోజకవర్గానికి ఒరిగేది ఏమీ లేదని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మొద్దని హెచ్చరించారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో కర్రె కృష్ణ, పెద్దబావి భుజంగరెడ్డి, జగన్మోహనాచార్యులు, మహిపాల్, సత్యనారాయణగౌడ్‌తో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌రెడ్డి, డానియల్, బాబు, మహేందర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, చిత్రం సాయి, బంగారు బాబు, సంతోశ్, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ విజయం ఖాయం

కందుకూరు: మహేశ్వరంలో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఆనంద్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని కొత్తూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన రాజు, పర్వతాలు, రవితేజ, సత్యనారాయణ, వినయ్‌తేజ, విజయ్, మధు, అనిల్, దేవానంద్ ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ ఇన్‌చార్జి పారిజాతం, గ్రామ అధ్యక్షుడు మీగడి స్వామి, ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణ, కార్మిక విభాగం అధ్యక్షుడు నవీన్, శ్రీనివాస్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సబితారెడ్డి ఇంటికే

- పేదలను పట్టించుకోని బీఆర్‌ఎస్
- బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు



ప్రచారంలో మాట్లాడుతున్న శ్రీరాములు

మహేశ్వరం: మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డిని ఓడించి ఇంటికి పంపించాలని మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రామచంద్రగూడ, పెండ్యాల, కల్వకోల్, దుబ్బచర్ల, సుభాన్‌పూర్, జాండగూడ, కోళ్లపడకల్, పోరండ్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే బీజేపీని భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సబితారెడ్డి అనుచరుల ఆగడాలు మహేశ్వరంలో శృతిమించి పోయాయని మండిపడ్డారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాయని తెలిపారు. మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానికులకు ఇవ్వకుండా పాతబస్తీకి చెందిన ఎంఐఎం కార్యకర్తలకు సబితారెడ్డి పంపిణీ చేశారని మండిపడ్డారు. అర్హులకు దళిత, బీసీబంధు పథకాలివ్వకుండా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఇచ్చారని ఆరోపించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మహేశ్వరంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య యాదవ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మాసారం చంద్రయ్య గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు మాధవచారి, ప్రధాన కార్యదర్శులు సందీశ్వర్, బుగ్గని శంకర్, సర్పంచ్‌లు శ్రీశైలం గౌడ్, రఘుపతి గౌడ్, మనోహర్, సురేశ్, ఎంపీటీసీ వెంకటేశ్ పలువురు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన యువకులు జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు సిద్దాల దశరథ ఆధ్వర్యంలో ఆదివారం అందెల శ్రీరాములు యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీర్‌పేట కార్పొరేషన్ నుంచి ఇప్పటికే పెద్ద సంఖ్యలో యువకులు, ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరారని, నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

బీజేపీతోనే అభివృద్ధి

తుక్కుగూడ: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

కందుకూరు: మండల పరిధిలోని జబ్బార్‌గూడలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్‌కు ఓటు వేయాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సదర్‌లో అందెల

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ వేడుకలో అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.



కందుకూరు మండలంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బీఆర్‌ఎస్‌ను ఓడించండి

ఏఐఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

బడంగ్‌పేట్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని ఏఐఎంఎస్ (అల్ ఇండియా మహిళా సమైఖ్య) రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత పిలుపునిచ్చారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలోని ఎస్‌పీఐ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చని.. బీఆర్‌ఎస్ నాయకులు ఈ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. సామాజిక న్యాయం కోసం పాటు పడుతున్న ఎస్‌పీఐ బాటలోనే ఏఐఎంఎస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. నిరుద్యోగ యువతను రోడ్డున పడేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌పీఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం, రంగారెడ్డి జిల్లా మహిళ సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు జగదాంబ, స్వరూప, మీనా, నాగేంద్రమ్మ, నాగమణి, సీనియర్ నాయకుడు కృష్ణ తదితరులున్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి



ప్రార్థన చేస్తున్న కాశిక్‌రెడ్డి

మహేశ్వరం: ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీఆర్‌ఎస్ యువనాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామంలో గ్యార్వీ పండుగ ఉత్సవాల్లో ఆయన పాల్గొని.. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి, మహేశ్వరం మండలంలో ముస్లిం కమ్యూనిటీ హాళ్లు, స్మశాన వాటికలు, ఈద్గాలతో పాటు మసీదుల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయించారని తెలిపారు. మంత్రి మైనార్టీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు సభ్యులు సమీర్, ముస్లిం నాయకులు నసీర్‌ఖాన్, మీనాజ్ పటేల్, మన్సాన్‌పల్లి సర్పంచ్ అరుణ, ఉప సర్పంచ్ నర్సింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కవలపిల్లలు

బీజేపీ అభ్యర్థి దయానంద్‌గౌడ్



ప్రచారంలో భాగంగా చాయ్ అమ్ముతున్న దయానంద్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ ఇబ్రహీంపట్నంలో సోమవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కవలపిల్లలని వీరు రాష్ట్రానికి పట్టిన అరిష్టమని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశాయో చెప్పాలన్నారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీయే శ్రీరామరక్ష అని అన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, ప్రతాప్, నర్సింహారెడ్డి, బూడిద నర్సింహారెడ్డి, అంజయ్యయాదవ్, భాస్కర్, నాయిని సత్యనారాయణ, జక్క రవీందర్‌రెడ్డి, నిట్టు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

బ్రాహ్మణుల మద్దతు బీఆర్‌ఎస్‌కే

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్, అరవింద్‌శర్మ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రాబోయే ఎన్నికల్లో బ్రాహ్మణులంతా బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయచింత శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ ఆధ్వర్యంలో మహేశ్వర నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి బడంగ్‌పేట్‌లో బ్రాహ్మణ భవనం కోసం 1,100 గజాల స్థలం కేటాయించడంతో పాటు ఎమ్మెల్సీ సురభి వాణిదేవి భవన నిర్మాణానికి రూ.20లక్షలు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. ఇంద్రారెడ్డికి మద్దతుగా బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 18న బడంగ్‌పేట్‌లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి బ్రాహ్మణులంతా తరలిరావాలని కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవరావు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, యాదగిరిరావు, నారాయణరావు, మూర్తి, రామారావు, రవీందర్‌రావు, శ్యాంసుందర్‌రావు, శ్రీమన్నారాయణ, అనురాధ, అన్నపూర్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పేదలను విస్మరించిన బీఆర్‌ఎస్

- మంత్రి సబితారెడ్డిని ఓడిస్తాం
- 'గ్యారంటీ'లను అమలు చేస్తాం
- హస్తం పార్టీ హవా కొనసాగుతోంది
- కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్



మహేశ్వరం: ప్రచారంలో ప్రసంగిస్తున్న కేఎల్లాఆర్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) పిలుపునిచ్చారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూములను పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సోమవారం మండల పధిలోని నాగారం, నందుపల్లి, పెద్దతండా, ఎన్మఁచెర్వుతండా, ఎన్టీఆర్‌తండా, నాగిరెడ్డిపల్లి, పులిమక్త, గొల్లూరు, అమీర్‌పేట్, పెద్దమ్మతండా, నల్లచెర్వుతండా, మాణిక్యమ్మగూడ, కేబీతండా, జాండగూడ, గాంధీనగర్, దుబ్బచర్ల, కల్వకోల్, పెండ్యాల, రామచంద్రగూడ, మన్సాన్‌పల్లి చౌరస్తా, డబిల్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోందని, వచ్చే ఎన్నికల్లో 80 స్థానాలకుపైగా దక్కించుకుని, అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీ పథకాల అమలు చేస్తామని తెలిపారు. పేదల సంక్షేమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. మహేశ్వరం మండలంలోని మన్సాన్‌పల్లి, మంఖాల్, సర్దార్‌నగర్‌లో నిర్మించిన చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానికులకు కేటాయించకుండా, స్థానికేతరులకు మంత్రి పంపిణీ చేశారని విమర్శించారు. దళిత, బీసీబంధు పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ వంట గ్యాస్ ధర పెరిగితే పట్టించుకోకుండా మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400కు సిలిండర్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కేఎల్ఆర్ అభ్యర్థించారు.

ఇంటింటి ప్రచారం

అంతకు ముందు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, అమీర్‌పేట్ మాజీ ఎంపీటీసీ తొంట రాములు కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామాల్లో తండాల్లో కేఎల్ఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మాజీ ఎంపీపీలు కోరుపోలు రఘుమారెడ్డి, పాండునాయక్, మాజీ మండల అధ్యక్షుడు కావలి దశరథ, పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, సత్యనారాయణరెడ్డి, కృష్ణనాయక్, పాండునాయక్, లాజర్, నారాయణ, ప్రవీణ్, రాజునాయక్, శ్రీనివాస్ గౌడ్, చంద్రమోహన్, హరినాద్‌గౌడ్, చంద్రమోహన్, రాజు, ప్రవీణ్, రఘుపతి, బాల్‌రాజ్, అంజయ్య, రాజు, రాజేందర్, యాదయ్య పాల్గొన్నారు.

పతి కోసం సతి ప్రచారం



మీర్ పేటలో ప్రచారం చేస్తున్న విజయలక్ష్మి

మీర్‌పేట: మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి విజయలక్ష్మి సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి కేఎల్లార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కార్పొరేటర్‌లు చల్లా కవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మామ గెలుపు కోసం...

కేఎల్లార్ కోడలు అంజని సోమవారం సాయంత్రం జిల్లెలగూడ పరిధిలోని కమలానెహ్రూనగర్, దాసరి నారాయణకాలనీ, సాయినగర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గడప గడపకూ వెళ్లి ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి కేఎల్లార్ కుమారుడు అనురూప్‌రెడ్డి అభ్యర్థించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అనురూప్‌రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా తెలంగాణను పాలిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధిని విస్మరించిందని దుయ్యబట్టారు. పేదల సంక్షేమం కోసం పాటు పడే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఆరు గ్యారంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో మన్నె రవికుమార్, నవీన్ గౌడ్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జాన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

కందుకూరు: మండల పరిధిలోని అన్నోజిగూడలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సుధాకర్, ఢిల్లీ కృష్ణ, రఘుమయ్య, ఢిల్లీ రామకృష్ణ, ఢిల్లీ రాజు, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి వినోద్‌చారి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.